క్లుప్తంగా

ఐటీఐ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

మణుగూరురూరల్: పట్టణంలోని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులను దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 23వ వరకు అన్ని ట్రేడ్‌లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. 20వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులు దరఖాస్తుతో పాటు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు వచ్చి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

క్రీడా పోటీలు ప్రారంభం

దమ్మపేట: మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలను స్థానిక జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో, క్రీడా పోటీలను ప్రారంభించిన జెడ్పీటీసీ, ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోటీలకు హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలకు హాజరైన 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ దుస్తులను, జెడ్పీటీసీ సభ్యులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్‌ఎంలు, జగపతి, బజ్జూరి వెంకటేశ్వరరావు, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో..

దుమ్ముగూడెం: మండలంలోని గౌరవరం ఆశ్రమ పాఠశాల ఆవరణలో మండల స్థాయి అండర్-14, 17 విభాగం క్రీడా పోటీలను ఎంఈఓ సున్నం సమ్మయ్య గురువారం ప్రారంభించారు. మొదటి రోజు క్రీడా పోటీల్లో అన్ని పాఠశాలలకు చెందిన 300 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్ణశాల ఆయుర్వేద డాక్టర్ రాజేష్, డాక్టర్ పూజా ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్ల కలకలు రాకుండా ఉండేందుకు మందులు అందజేశారు. హెచ్‌యం సుజాత, పీడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని పలు ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యలను నియంత్రించేందుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణంలో పలు చోట్ల ఉన్న 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి వాటి స్థానంలో 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో గురువారం పట్టణంలోని భూపతిరావుకాలనీ, భగవాన్‌దాస్‌కాలనీ, జగదీష్‌కాలనీ, పోస్టాఫీస్, మసీద్ రోడ్ ప్రాంతాలలో 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాలలో నెలకొన్న లోఓల్టేజీ సమస్య పరిష్కారం కానుంది.

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

భద్రాచలంటౌన్: ఉమ్మడి హక్కులను విచ్ఛిన్నం చేసే ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజు అన్నారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు షెడ్యూల్ కులాలను విభజించడం కాని గ్రూపుగా చేయడంగాని చేసే హక్కు పాలక ప్రభుత్వాలకు లేవని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించి వారికి రావల్సిన విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో వారికి రావల్సిన వాటాను రాకుండ చేసే కుట్రను రాజకీయ పార్టీలు చేస్తున్నాయని అయన ఆరోపించారు. సమావేశంలో సురేష్, ముత్యాలరావు, సాగర్, వెంకట్రావ్, నాగబాబు, దిలీప్, అచ్చుత్ కుమార్ పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆహార పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా పాల్గొన్న ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, ఆర్‌ఎంఓ రాజశేఖర్ రెడ్డి రోగుల సహాయకులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులకు ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కార్యక్రమం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మస్తాన్, ఉస్మాన్, ఇమాన్, అలీ, అమీర్, మైదిన్ పాల్గొన్నారు.

ఆపరేషన్లు విజయవంతం

ములకలపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శస్త్రచికిత్సలు విజయవంతమయ్యాయి. క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల ములకలపల్లిలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, 110 మందికి సేవలు అందించారు.

వీరిలో 11 మందికి శస్త్రచికిత్సలు చేయాల్సిందిగా గుర్తించారు. వీరందరికీ గురువారం వైరాలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఆస్పత్రి నిర్వాహకులు లయన్స్ డిస్ట్రిక్ జీఎంటీ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు నేతృత్వంలో కంటి ఆపరేషన్లు నిర్వహించారు. శస్త్రచికిత్సలు విజయవంతమైనట్లు క్లబ్ అధ్యక్షుడు రాయల కేథారేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, ట్రెజరర్ రంజాన్, సభ్యులు జగన్, చిట్లూరి రంజిత్, అనంతుల మహేశ్, గ్రామీణ వైద్యులు కొమ్ము నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం

- జాతీయ భాష ప్రాముఖ్యతను వివరించిన ఉపాధ్యాయులు
- పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు



దుమ్ముగూడెం: హిందీ అధ్యాపకుడిని సన్మానిస్తున్న విద్యార్థులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ దినోత్సవాన్ని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల హిందీ అధ్యాపకుడు పి.శ్రీనివాసరావును విద్యార్థుల సమక్షంలో సత్కరించి హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశ భాష గొప్పతనాన్ని దేశం ఐక్యతను కాపాడుకోవడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చర్ల: చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం హిందీ బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సత్యనారాయణ మాట్లాడారు. హిందీని జాతీయ భాషగా ప్రభుత్వం ప్రకటించిన దినాన్ని పురస్కరించుకుని హిందీ భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: స్థానిక పైలట్‌కాలనీలోని ఎక్స్‌లెంట్ పాఠశాలలో గురువారం హిందీ దివస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎండీ.ఖాదర్ మాట్లాడారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు సమద్, స్వర్ణలత, రజితలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్, డైరెక్టర్ ఎండి.యాకుబ్ షరీఫ్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన తెల్లం



మంత్రి కేటీఆర్‌తో తెల్లం వెంకట్రావ్

భద్రాచలం: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్రమంత్రి కేటీఆర్‌ను భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావ్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ తరుపున భద్రాచలం నియోజకవర్గంలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మేరకు తెల్లం వెంకట్రావ్ గురువారం ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు ప్రత్యేక నిధులను కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను, కేటీఆర్‌లను కోరినట్లు అందులో పేర్కొన్నారు. భద్రాచలంలో కరకట్టను 530 మీటర్ల మేర పొడిగించి నిర్మాణం చేయాలని విన్నవించినట్లు తెలిపారు. స్పందించిన సీఎం కేసీఆర్, కేటీఆర్‌లు త్వరలోనే వీటిని పరిశీలించి నిధులను కేటాయిస్తామని చెప్పినట్లు వెంకట్రావ్ పేర్కొన్నారు.

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అశ్వాపురం: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుతో కలిసి హైదరాబాద్‌లో ప్రగతి భవన్‌లో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఏజెన్సీలో బదిలీలు, పదోన్నతులు మైదాన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతం, ఏజెన్సీ ప్రాంతం నుంచి ఏజెన్సీ ప్రాంతానికి మాత్రమే నిర్వహించాలని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సత్యవతి రాథోడ్‌తో, ప్రిన్సిపల్ సెక్రటరీతో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడినట్లు వారు తెలిపారు. అనంతరం నాయకులు మంత్రి సత్యవతిరాథోడ్‌ను కలిసి సమస్యపై విన్నవించారు. సుప్రీం కోర్టులో ఉన్న ఉమ్మడి రాష్ట్రాల రివ్యూ పిటిషన్లు, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ వేసిన రివ్యూ పిటిషన్లపై మంత్రికి వివరించారు. తగిన న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్, ఏటీఏ రాష్ట్ర కార్యదర్శి సారయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిగే సమ్మయ్య, కోరెం శ్రీనివాసరావు, సింగా రవిబాబు, పాయం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

బూర్గంపాడు: ఒంటరి మహిళలు, వితంతువుల ఆర్థికాభివృద్ధికి ఐటీసీ ఎంఎస్‌కే సహకారంతో బంధన్ సంస్థ తోడ్పాటునందిస్తుందని ఆ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ దీపక్ అన్నారు. సారపాకలో గురువారం 27 మంది పేద ఒంటరి మహిళలకు, వితంతువులకు ఒక్కొక్కరికి రూ.8,400 చొప్పున ఆర్థిక చేయూతనందించారు. రెడీమెడ్ దుస్తులు, కిరాణా, లాండ్రి, ఫ్యాన్సీ, కూరగాయలు, ఫ్రూట్స్, చికెన్ షాప్స్, ఫుట్‌వేర్, టైలరింగ్ వంటి యూనిట్లు కోసం వారికి ఆర్థిక చేయూతనందించారు. ఈ చిరువ్యాపారులను సక్రమంగా నిర్వహించుకునేందుకు బంధన్ సంస్థ తగు శిక్షణనిస్తుందన్నారు. ఐటీసీ ఎంఎస్‌కే పీఓ సుచిత్ర, బంధన్ ఏరియా కోఆర్డినేటర్ ఉత్తం మరిజిత్, నాగరాజు, ఇరవెండి సర్పంచ్ కొర్సా లక్ష్మి, కోయగూడెం సర్పంచ్ రామలక్ష్మి, శరత్, నాగేంద్రబాబు,అంబేడ్కర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం అక్రమంగా తరలిస్తున్న 20 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. టౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద టౌన్ ఎస్సై విజయలక్ష్మి తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె బ్యాగులో రూ.4లక్షల విలువైన 20 కేజీల గంజాయిని గుర్తించారు. విచారించగా ఆమె పేరు మండవి ఆర్తి అని తెలిసింది. కోరాపుట్‌లో కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఉన్న మినాతి అనే మహిళకు అమ్మడానికి వెళ్తున్నట్లు తేలింది. అనంతరం పట్టుబడిని గంజాయిని సదరు మహిళను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అక్రమంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై భద్రాచలం టౌన్ పోలీసులు దాడి చేసి ఏడుగురుని అరెస్టు చేశారు. ఈ ఘటన గురువారం రాత్రి 9 గంటలకు పట్టణంలోని రాజుల సత్రంలో చోటుచేసుకుంది. భద్రాచలం సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సూపర్‌బజార్ వద్ద ఉన్న సత్రంలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఏడుగురుని అరెస్ట్ చేసి రూ.1,17,550 లు నగదు, 7 సెల్‌ఫోన్లు, కొన్ని సెట్ల ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

భవిష్యత్‌పై దృష్టి సారించాలి

చర్ల: టీనేజ్‌లోని యువతీ యువకులు ఆలోచనా జ్ఞానాన్ని కలిగి ఉండాలని, క్షణికావేశాలతో బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సూచించారు. చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సీజనల్ వాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు



దుమ్ముగూడెం: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రేణుక రెడ్డి

మణుగూరురూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో, బీసీ గురుకుల బాలుర పాఠశాలలో వైద్యశిబిరాలను నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, డాక్టర్ అనూషలు ఆయా గ్రామాల ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. పలువురు జ్వరపీడితుల రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలకు విషజ్వరాలు విజృంభిస్తాయని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ రవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పీహెచ్‌సీ పరిధిలోని పైడిగూడెం, చింతగుప్ప గ్రామాల్లో డాక్టర్ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో గురువారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీజనల్ వ్యాధుల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌ఎన్ వెంకట నరసమ్మ, హెచ్‌ఏ నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం పార్వతీ, సారిక, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

కరకగూడెం: మండల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తాటిగూడెం గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేసారు. సుమారు 65 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అశ్వాపురం ఎఫ్‌ఆర్‌ఓగా రమేష్

అశ్వాపురం: అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారిగా ఎస్.రమేష్‌ను నియమిస్తూ అటవీ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ మంచిర్యాల రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో అశ్వాపురం డీఆర్‌ఓగా పని చేశారు. ప్రస్తుతం మణుగూరు రేంజ్ అధికారి ద్వాలియా అశ్వాపురం ఇన్‌చార్జ్ రేంజర్‌గా వ్యవహరిస్తున్నారు. రమేష్‌ను పూర్తి స్థాయి రేంజర్‌గా నియమించడంతో రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

రామయ్యను దర్శించుకున్న డీసీహెచ్‌ఎస్

భద్రాచలంటౌన్: భద్రాచలంలో సీతారామచంద్ర స్వామివారిని ఖమ్మం ప్రధానాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్- సుజన దంపతులు గురువారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ రమాదేవికి సీడ్ గణపతి విగ్రహాన్ని అందజేసి ఆలయ సమీపాన మొక్క నాటారు. కార్యక్రమంలో ఏఈఓ భవానీ రామకృష్ణ, ఈఈ రవీంద్రనాథ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కరకగూడెం: జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా నరసింహారావు దొర అధ్యక్షతన ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా గొగ్గల రవితో పాటు గొగ్గల సతీష్, గొగ్గల కృష్ణ, చందా రామకృష్ణ, చందా శ్యాంసుందర్, కొమరం సత్యనారయణ, ఊకే సారయ్యతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సర్వీసులు పెంచాలి

దుమ్ముగూడెం: మీ సేవా కేంద్రాల నిర్వాహణ భారం పెరిగిందని, ఆ మేరకు కమీషన్‌పై సేవలను విస్తృతపరచాలని మీ సేవ నిర్వాహకులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మీ సేవ నిర్వాహకులు బాలాజీ, రమేష్, అనిల్, సమ్మయ్యలు పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

భద్రాచలంఅర్బన్: దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని, పర్యావరణ పరిరక్షణపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సెయింట్ పాల్స్ అధినేత కె.అబ్రహం అన్నారు. గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో స్థానిక అభయాంజనేయ స్వామి పార్క్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి ప్రసంగించారు. గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు బెల్లంకొండ రాంబాబు, కోశాధికారి విష్ణుమొలకల సుబ్రహ్మణ్యం, మాజీ అధ్యక్షుడు గోళ్ళ భూపతిరావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, సెయింట్ పాల్స్ అధ్యాపకులు రాజు, బాబా, అగస్టీన్, వినోద్, అరుణ, ఉమా భారతి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

మణుగూరురూరల్: జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు విషయంలో మొండివైఖరిని ప్రదర్శించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము హుస్సేన్, ఉసికెల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

చర్ల: మండల కేంద్రంలోని గొల్లకట్టలో గురువారం శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ రంగు రమేష్ ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ గీదా కోదండరామయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, ఎంపీటీసీ సభ్యురాలు మడం పద్మజ, మడకం జ్యోతి, వార్డు సభ్యులు సత్యనారాయణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు



ల్యాబ్‌లో తనిఖీ చేస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి: ఆర్‌ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయకూడదని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని పలు ఆర్‌ఎంపీల క్లినిక్‌లను, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే అందించాలన్నారు. అనంతరం రాజాపురం గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌ఎస్ నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పుష్ప, వాణి, ఆశాలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి అమలయ్యేలా చూడాలి

చర్ల: నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అమలయ్యేలా చూడాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సూచించారు. చర్ల మండలంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున 54 మందికి రూ.54,06,264లు మంజూరు కాగా వాటికి సంబంధించిన చెక్కులను గురువారం చర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ గీదా కోదండరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, తహసీల్దార్ రంగు రమేష్, డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: అర్హులైన ప్రతి ఒక్క నిరుపేదకూ కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేయాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. గురువారం మండల అభివృద్ధి సమావేశ కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 83 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ మణిధర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యాన్ని వీడాలి



భద్రాచలంటౌన్: పీఓకు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య విధానాన్ని వీడాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుమ్మడి సమ్మయ్య అన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో విద్యారంగం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఐటీడీఏ భద్రాచలం కార్యాలయం ఎదుట గురువారం నిరసన ప్రదర్శన చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఐటీడీఏ పీఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 3 అమలుపై స్పష్టతను ఇవ్వలేకపోతోందని, గిరిజన ప్రాంతాల్లో నియామకాలు, పదోన్నతులు గిరిజనులకే దక్కాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.రాజు, రామాచారి, హరిలాల్, రాంబాబు, సత్తిబాబు, గంగరాజు, సరియా, రమేష్, ఉమాదేవి, కృష్ణబాబు, బాలు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9న ఆదివాసీల బంద్

దుమ్ముగూడెం: ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ భద్రాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 9న చేపట్టిన భద్రాద్రి బంద్‌ను విజయవంతం చేయాలని ఏవీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1/70 చట్టం అమలులో ఉన్న షెడ్యూల్ ఏరియా ప్రాంతంలో చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను స్థానిక ఆదివాసుల చేతనే భర్తీ చేయాలని, ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు చేపట్టనున్న నియోజకవర్గస్థాయి బంద్‌ను దిగ్విజయం చేయాలని కోరారు.

ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్

ములకలపల్లి: ఎన్నికల విధులకు పోలీస్‌శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ పోలీసులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన నియోజకవర్గస్థాయి పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎలక్షన్‌లు ఎప్పుడు వచ్చినా, ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. సమావేశంలో అశ్వారావుపేట, పాల్వంచ సీఐలు కార్తీక్, వినయ్‌కుమార్, స్థానిక ఎస్సై సాయి కిషోర్‌రెడ్డితోపాటు అశ్వారావుపేట దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, చండ్రుగొండ ఎస్సైలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పల్లె ప్రగతి బాట

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ శ్రేణులు కేసీఆర్ పల్లె ప్రగతి బాట కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని కోటకట్ట(హరిజనవాడ) ప్రాంతంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ పోశం నరసింహారావు మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షులు ముత్యంబాబు, నాయకులు పాడుతూరి విక్రమ్, ముత్తయ్య, జి శ్రీనివాసచారి,పాండు, మహిళా, యువజన నాయకులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు ఇవ్వాలి

దుమ్ముగూడెం: అసైన్‌మెంట్ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు వెంటనే ఇవ్వాలని సీపీఎం నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం, మారాయిగూడెం గ్రామ రైతులతో ధర్నా నిర్వహించి తహసీల్దార్ చంద్రశేఖర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ. తెలంగాణ పట్టాదారు పాస్ పుస్తకాలు మారాయిగూడెం, భీమవరం గ్రామాల రైతులకు రాలేదని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీ, కొండపల్లి శ్రీధర్, మర్మం చంద్రయ్య, మండల నాయకులు నిమ్మల మధు, సరియం ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ ఉబ్బా భద్రయ్య, అపక సత్యం, సోది వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనం పెంచాల్సిందే..

సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీల సమ్మె గురువారం కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో వారు వినూత్న రీతుల్లో నిరసన తెలిపారు. పలు పార్టీల నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు నెలకు కనీసం వేతనం రూ.26వేలు, బీమా సౌకర్యం, పింఛన్ తదితర డిమాండ్లు చేశారు. ప్రభుత్వం వేతనాలను పెంచాల్సిందేనని తేల్చి చెప్పారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



గుండాల: ఆళ్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు, నాయకులు



దుమ్ముగూడెం: సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య